నేషనల్ స్కాలర్‌షిప్ పరీక్షకు 2954మంది హాజరు

విశాలాంధ్ర - కాకినాడ : పరీక్ష సన్నాహాల సేవల్లో భాగంగా ఆకాష్ బైజూస్ నేషనల్ హంట్ 13వ ఎడిషన్ పరీక్ష నిర్వహించగా కాకినాడ నగరానికి చెందిన 2954మంది హాజరయ్యారు. ఆన్‌లైన్ విధానంలో నవంబర్ 4నుంచి 13వరకు, ఆఫ్‌లైన్ విధానంలో నవంబరు 5 నుంచి 13వరకు దేశవ్యాప్తంగా 24రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో విజేతలకు విభిన్నగ్రేడ్‌లకు చెందిన 5గురిని ఉచితంగా నాసాను తల్లిదండ్రుల తోడుగా సందర్శించే అవకాశం కల్పించడంతోపాటు అత్యున్నత ర్యాంకు పొందిన విద్యార్థులకు రూ.2లక్షల నగదు చెల్లిస్తారన్నారు.

విద్య అలవాట్లు పిల్లల భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర - అనపర్తి : అంగన్వాడి సెంటర్ల ద్వారా అందిస్తున్న విద్య, అలవాట్లు పిల్లల భవిష్యత్తుకు పునాది వంటిదని, ప్రథమ్ సంస్థ చైతన్య కార్యక్రమాలు అభినందనీయమని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రామవరం అంగన్వాడి సెంటర్ 153లో అంగన్వాడి వర్కర్ దుర్గాభవాని ఆధ్వర్యంలో ప్రథం ఫౌండేషన్ నిర్వహించిన పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఉప సర్పంచ్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి సారధ్యంలోని వైసిపి ప్రభుత్వం అంగన్వాడి సెంటర్ల బలోపేతానికి కృషి చేస్తుందని అన్నారు. ప్రధమ్ ప్రోగ్రాం బోర్డు మెంబర్ విబా, డైరెక్టర్ సునీత అంగన్వాడి పిల్లల తల్లులు, వాలంటీర్లకు ప్రోగ్రామ్కు సంబంధించి పలు సలహాలు, సూచనలు చేశారు. అంగన్వాడి వర్కర్ దుర్గాభవాని పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, రాయవరం ఐసిడిఎస్ సిడి పి. వరహాలక్ష్మి, రామవరం సెక్టార్ సూపర్వైజర్ వి. ఛాయా దేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్‌లో కాత్రేనికోన విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - కాత్రేనికోన : కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఉమ్మడి జిల్లా స్థాయి అండర్17 బాలికల అథ్లెటిక్స్‌లో కాత్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఎం. స్వర్ణాంజలి ప్రతిభ కనపరిచింది. ఆమె లాంగ్ జంప్ విభాగంలో మూడవ స్థానం, హైజంప్ విభాగంలో నాలుగో స్థానం సాధించింది. అండర్ 17 బాలుర విభాగంలో 200 మీటర్స్ నాలుగో స్థానం, 400 మీటర్ నాలుగవ స్థానంలో పాఠశాల విద్యార్థి మల్లాడి సింహాద్రి నిలిచారు. మంగళవారం విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీచైర్మన్ గిడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మేధావుల బోధనలు విద్యార్థులకు ఉపయోగకరం

విశాలాంధ్ర - అనపర్తి : మేధావుల సాంగత్యం, బోధనలు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిబిఆర్ విద్యాసంస్థల సెమినార్ హాల్లో రామానుజన్ మ్యాథమెటిక్స్ అకాడమీ ఆధ్వర్యంలో గణిత మేధావి, ఆచార్య పివి అరుణాచల స్మారక అవార్డు 2022 ప్రధానోత్సవ వేడుక జిబిఆర్ విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మహర్షి సాగర్ సారధ్యంలో ఆచార్య పివి అరుణాచలం స్మారక అవార్డు గణిత అవధాని, గణిత శాస్త్ర పాఠ్యపుస్తక రచయిత, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణకు ఎమ్మెల్యే సత్తి చేతుల మీదగా అకాడమీ ప్రతినిధులు అవార్డు ప్రదానం చేశారు. గజమాల, కిరీటం, దుశ్శాలువాతో సాయి రామకృష్ణను ఘనంగా సత్కరించారు. దీనికి ముందు ప్రిన్సిపల్ పి ఆర్ఎల్ స్వామి, రామారావు సాయి రామకృష్ణ సాయి రామకృష్ణ కాళ్ళు కడిగి పాదపూజ చేశారు. రామానుజన్ మ్యాథమెటిక్స్ అకాడమీ వ్యవస్థాపకులు కేవీ సత్యనారాయణ, గణిత అవధాని యమ్ నాగర్జున, బందారులంక రామారావు, నాగేంద్ర మహర్షి సాగర్ విద్యార్థులకు గణిత శాస్త్రం పై కల్పించే అవగాహన ప్రయత్నం విద్యార్థులను ఆలోచింపజేసింది. అనంతరం జిబిఆర్ జూనియర్ కళాశాలలో 150 మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు ప్రిన్సిపల్ స్వామి తండ్రి శ్రీరామచంద్రమూర్తి పేరిట జ్ఞాపికలను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నల్లమిల్లి పెద్ద అబ్బాయి రెడ్డి, విద్యా సంస్థల డైరెక్టర్ పాపిరెడ్డి, హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జీవ మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఈ నెల 28, 29, 30వ తేదీలు, డిసెంబర్ ఒకటో తేదీన నిర్వహించే 31వ వార్షిక ఉజ్జీవ మహాసభలు క్రిస్మస్ వేడుకను ప్రజలు విజయవంతం చేయా లని మండల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ బి.దానియేలు, కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ జె. జయరాజు, కోశాధికారి రెవరెండ్ వి. సామ్యూల్ రాజులు పిలుపునిచ్చారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఉజ్జీవ మహాసభల్లో ప్రసంగికులుగా హైదరాబాద్ ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ బి. జెర్మియా, రాజమండ్రికి చెందిన రాక్ చర్చ్ ఆఫ్ ఇండియా, టీవీ వర్తమానికులు డాక్టర్ పి. జాన్ లాజరస్, రాజమండ్రి బైబిల్ మిషన్ అధ్యక్షులు ఎస్. విజయరాజులు విచ్చేసి దైవ వర్తమానాలను అందించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉజ్జీవ మహాసభల్లో ప్రత్యేక ఆకర్షణగా డిసెంబర్ ఒకటో తేదీన ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రెవరెండ్ బి. సత్యానందం, ఆనంద్ జోసెఫ్, బ్లెస్సింగ్, ఆనందబాబు, ఎం. జేమ్స్, ఎ. చంటి, బన్ను ప్రసాద్, జై బాబు, బెంజిమెన్, ఎ.పీటర్, తదితరులు పాల్గొన్నారు.

సుశీలకు పురస్కారం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో గణిత విభాగం లెక్చరర్‌గా గత దశాబ్ద కాలంగా సేవలందిస్తున్న ఎం. సుశీలకు స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు ఇటీవల నిర్వహించిన ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయుల సదస్సులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో 'గురు స్పందన' పురస్కారంతో సత్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌టివిఎస్ కుమార్ తెలియజేసారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్. శేషారెడ్డి స్పందన ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఇదా శామ్యూల్ రెడ్డి, రాజమహేంద్రవరం జైల్ల శాఖ సూపరింటెండెంట్ ఎస్. రాజారావు చేతుల మీదుగా గురు స్పందన పురస్కారం తీసుకున్నట్లు సుశీల ఆనందం వ్యక్తం చేశారు. సుశీలకు అవార్డు రావడం పట్ల ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్. సతీష్ రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌టివిఎస్ కుమార్, డీన్ ఎవి మాధవరావు, వివిధ విభాగాధిపతుల ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

తాటాకిల్లు దగ్ధం

విశాలాంధ్ర - కాజులూరు : మండలంలోని బందనపూడి శివారు మొగలిపాలెంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక తాటాకు ఇల్లు పూర్తిగా కాలిబూడిదయ్యింది. గ్రామానికి చెందిన తాడి వీరలక్ష్మీ భర్త మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయి గత కొన్నాళ్ళక్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. దీంతో వీరలక్ష్మీ వ్యవసాయ పనులు చేసుకుంటూ తన ఇద్దరు పిల్లలతో ఒక తాటాకు ఇంటిలో నివాసముంటున్నది. మంగళవారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లిపోగా తానూ పొలంపనులకు వెళ్లింది. మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా తాటాకు ఇంటిపై మంటలు సంభవించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. పరిసరాలలోని గృహాలకు నిప్పంటుకోకుండా స్థానికులు జాగ్రత్తలు తీసుకున్నారు. మండల రెవిన్యూ అధికారి వేగేశ్వరరావు, పివి సూర్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆస్తినష్టం రూ.రెండు లక్షలు ఉంటుందని తెలిపారు.

ప్లాస్టిక్‌పై కార్పొరేషన్ కొరడా

- 600 కేజీల సరుకు స్వాధీనం
- రూ.60వేల జరిమానా

విశాలాంధ్ర - కాకినాడ : నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల వినియోగంపై నగరపాలక సంస్థ కొరడా ఝుళిపించింది. కమిషనర్ కె. రమేష్, ఏడీసీ నాగనరసింహారావు ఆదేశాల మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ప్రజారోగ్య విభాగం మంగళవారం సంయుక్తంగా కాకినాడ మెయిన్‌రోడ్డు, పెద్దమార్కెట్, గ్లాస్ హౌస్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్ పర్యవేక్షణలో సిబ్బంది ఈ ఆకస్మిక తనిఖీలు చేశారు. 12 దుకాణాల్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 12 దుకాణాల్లో చేసిన తనిఖీల్లో సుమారు 600 కేజీల సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ లభ్యమైంది. ఆయా దుకాణ యజమానులకు సుమారు రూ.60వేలు జరిమానా విధించినట్టు కాలుష్యనియంత్రణ మండలి ఈఈ అశోక్‌కుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్ చెప్పారు. నిషేధించిన సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించడం చట్టరీత్యా నేరమని, భవిష్యత్‌లో మళ్ళీ వీటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రం కాకినాడను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులుకూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భావితరాల భవిష్యత్‌కు నష్టం కలిగే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, పలువురు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంఘం జాతీయ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - రాజోలు : భవన నిర్మాణ సంఘం జాతీయ మహాసభలు జయ ప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా కన్వీనర్ పెద్దిరెడ్డి సత్య నారాయణ పిలుపునిచ్చారు. రాజోలు మండలం తాటిపాక యూనియన్ కార్యాలయంలో పెచ్చేటి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పియస్ నారాయణ, ఎఐటియుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె. సత్తిబాబు, కుంపట్ల సాయి బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 26 తేదీ ప్రదర్శన బహిరంగ సభకు జిల్లా నుంచి 100 మంది హాజరు కావాలని సమావేశం తీర్మానించింది. భవన నిర్మాణ జిల్లా మహసభ ఏర్పాటు కోసం డిసెంబర్ మొదటి వారంలో అమలాపురంలో సమావేశం నిర్వహించి మహసభ తేదీలు నిర్ణయించాలని తీర్మానించింది. ఈ కార్యక్రమంలో కొప్పి శెట్టి నాగార్జున రావు, గుబ్బల వెంకటరమణ, దంగేటి జగన్నాథ్, కురచ నాగేశ్వర రావు, చొల్లంగి సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లకు ఐదు లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - అమలాపురం : జగనన్న ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందించాలని సీపీఐ ముమ్మిడివరం నియోజకవర్గ సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయంలో పలివెల రాంబాబు అధ్యక్షతన జరిగిన శాఖా కార్యదర్శుల సమావేశానికి జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు హాజరై రాజకీయ రిపోర్ట్ ఇచ్చారు. అనంతరం సమితి నిర్ణయాలు అమలు చేయాలని, ఈనెల 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజు రాజ్యాంగ పరిరక్షణ దినంగా పార్టీ, ప్రజా సంఘాలు పాల్గొని ప్రతిన పూనాలని అన్నారు. రాజ్యాంగం రచించిన మహనీయుడు అంబేద్కర్‌కు ఘన నివాళి అర్పించాలని పార్టీ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు మట్టపర్తి నారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 26న సీపీఐ 98వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కోరారు. కాంగ్రేకుల సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం బలోపేతం చేసేందుకు కృషిచేయాలని అన్నారు. ఈ సమావేశానికి శాఖా కార్యదర్శులు, మండల కార్యదర్శులు హాజరయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు బాలికలు

విశాలాంధ్ర - చాగల్లు : ఈ నెల 21న భీమడోలులో జరిగిన జిల్లా స్థాయి (అండర్-14) ఫుట్ బాల్ పోటీల్లో చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు.ఈ మేరకు ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు మంగళవారం తెలిపారు.జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు జ్యోత్స్న, జాహ్నవి,అన్నపూర్ణ లు త్వరలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపా ధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు.వీరిని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఎండీయూ ఆపరేటర్ల ఫెడరేషన్ ఎన్నిక

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా ఎండీయూ ఆపరేటర్స్ ఫెడరేషన్ ఎన్నిక శిల్పాకళారామంలో నిర్వహించారు. ఏపీ ఎండీయూ అధ్యక్షురాలు అనిత అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో కాకినాడ జిల్లా అధ్యక్షునిగా ధూళి లవకుశరాజు, ప్రధాన కార్యదర్శిగా సామర్లకోట అధ్యక్షుడు దర్శిపాటి సత్యానందం, కోశాధికారిగా తాళ్లరేవు మండల ఆపరేటర్ కడియాల కిషోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఆపరేటర్లు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అపరాల సాగుపై రైతులు దృష్టి సారించాలి

విశాలాంధ్ర - కిర్లంపూడి : వరి సాగు తర్వాత రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత అన్నారు. నిత్యం ఒకే పంట వేయడం వలన భూసారం తగ్గిపోతుందని అన్నారు. పంట మార్పిడి వల్ల రైతులకు లాభదాయంగా ఉండడమే కాకుండా, భూసారం పెరుగుతుందన్నారు. నిత్యం ఒకే పంటను సాగు చేయడం వలన భూమి నుండి సంక్రమించే తెగుళ్లు విపరీతంగా పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాలపురెడ్డి కాశీ విశ్వనాథం, ఎంపీటీసీ నంది వెంకటరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు వి. సునీత, నంది కృష్ణమూర్తి, మొగిలి లచ్చారావు, సామి రెడ్డి వెంకట్రావు కంద జియేశ్వరరావు, బర్రె నాగులు, కాకిలేటి ఏసుదాసు, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక రాజమండ్రి కాలనీకి చెందిన నక్క దుర్గారావు (26) వివిధ వ్యాధుల బారినపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. ఏఎస్ఐ సుబ్బిరెడ్డి తెలిపిన వివరాలను ఎలా ఉన్నాయి. దుర్గారావు ప్రేమ వివాహం చేసుకొని హైదరాబాదులో స్థిరపడి అక్కడ క్యాన్సరు వ్యాధి రావడంతో స్వగ్రామమైన ఏలేశ్వరం వచ్చి కాపురం ఉంటున్నాడు. ఇటీవల కొంత కాలం క్రితం అతనికి టీబి రావడంతో డాక్టర్ చూసిన మేరకు దాంపత్య జీవితానికి దూరంగా ఉండటంతో మనస్తాపన గురై ఉరేసుకున్నట్లు ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

కొబ్బరిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ నాణ్యత, భరోసాలపై శిక్షణ

విశాలాంధ్ర - అంబాజీపేట : డాక్టర్ వైయస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం, అంబాజీ పేటలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల, జీవనోపాధి పథకం (ఎపియల్ఐపి) ఫేజ్-2 ద్వారా కొబ్బరిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, నాణ్యత, భరోసా అనే శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నవంబర్ 22, 23 తేదీలలో పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసులు పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక చేసిన ఉద్యాన శాఖ అధికారులకు, ఫార్మర్స్ సొసైటీ సభ్యులకు వివిధ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ కోనసీమ కొబ్బరి రైతులకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, వాణిజ్య రంగాలకు మద్దతుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందని హర్షం వ్యక్తం చేసారు. నిర్వాహకులు కె. నజానాయక్, డిడి హెచ్, ఎపియల్ ఐపి మాట్లాడుతూ కొబ్బరి ఉత్పత్తులకు విలువ జోడించి, జాతీయ,అంతర్జాతీయ వాణిజ్య రంగాలలో రాణించుటకు జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ వారి 90 శాతం ఆర్థిక సహకారంతో రాష్ట్రంలోని ఫార్మర్స్ సొసైటీలతో కలసి, 5 రకాల ఉద్యాన పంటలు ఎంపిక చేసిందన్నారు. ఈ పథకం ద్వారా రూ.3.5 కోట్ల నిధులను వెచ్చించి, అంబాజీపేట కృషీవల ఫార్మర్స్ సొసైటీ ప్రాంగణంలో ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పి, ఆంధ్రప్రదేశ్ ఆహార ప్రాసెసింగ్ సంస్థ ద్వారా వాణిజ్య రంగంలో రైతులకు సహకారం చేసే ధ్యేయంగా 2019 సంవత్సరంలో ప్రారంభించిన ఈ పథకం 2023 వరకు క్షేత్ర స్థాయిలో రూపొందించగలమని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇ. మోహనరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.మల్లిఖార్జున రావు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉద్యాన అధికారి వై. సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా తయారుకావాలి

విశాలాంధ్ర - కాకినాడ : విద్యార్థులు నూతన మార్గాలు అన్వే షిస్తూ వ్యవస్థాపకులుగా తయారు కావాలని డాక్టర్ బీవీఆర్ మోహనరెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైంట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బీవీఆర్ మోహనరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారాలనే ఆలోచన అంతర్లీనంగా రావాలన్నారు. విద్యా ర్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ విలువైన సూచనలందించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీకళాశాల సెక్రటరీ ఎస్.సుగుణ మాట్లాడుతూ ఐటీరంగంలో ఎంతోమందికి మార్గదర్శకులు, గురుతుల్యులైన మోహనరెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావడం ఆనందమన్నారు. ఏపీ ఐటీప్రమోషన్స్ జీఎం వి.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన వ్యవస్థాపకులకు ప్రభుత్వం ఏవిధమైన ప్రోత్సాహకాలు ఇస్తుందో తెలియచేశారు. క్రిఫి కృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవస్థాపకులుగా తయారుకావడానికి, నూతన పరిశ్రమల స్థాపనకు సుదూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వనరులను ఉపయోగించి ఎదగవచ్చన్నారు. అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ డిగ్రీ మొదటి ఏడాదినుంచి ఆదిత్య విద్యార్థులకు అందిస్తున్న ఐటీ, సాఫ్ట్‌వేర్ శిక్షణ, నిర్వహిస్తున్న ప్రాజెక్టులను వివరించారు. కార్యక్రమంలో ఆదిత్యవిద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్స్ కరుణ, బ్యూలా, రమేష్, సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడ్ల బండి రైతుల ఆందోళన

విశాలాంధ్ర - కరప : స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ఎడ్ల బండి రైతులు ఆందోళన చేసారు. రైతుల వద్ద నుండి ధాన్యం తీసుకు వెళ్లేందుకు అధికారులు అనుమతి లేదని చెప్పడం జరుగుతుందని అందువలన తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఎడ్ల బండితోనే మా కుటుంబ జీవనాధారం అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. దీనిపై తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రైతు భరోసా కేంద్రాలలో ఈ పంట నమోదు చేసిన ప్రతి రైతు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

మహారాజశ్రీ యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
HMOP 71/2022

Between:
ఉద్దండం అప్పలరామనారాయణమూర్తి ....పిటీషనరు
And:
ఉద్దండం అరుణ ....రెస్పాండెంట్
To,
ఉద్దండం అరుణ, w/o అప్పలరామ నారాయణ మూర్తి, c/o పి.విశ్వనాథం, F F4 గోకులం అపార్ట్‌మెంట్, సింహాద్రినగర్, వలస పాకల, కాకినాడ రూరల్, కాకినాడ జిల్లా.

ప్రకటన

పై నెంబరు పిటిషనులో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు మీకు నోటీసులు పంపించిన మీరు ఉద్దేశపూర్వకంగా పుచ్చుకొనలేనందున పై నెంబరు పిటిషనులో మీకు నోటీసు అమలు నిమిత్తం పేపరు ప్రకటన ద్వారా అమలు జరిపించుకొనుటకు గాను పై కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు.
అందున పై నెంబరు పిటిషను తే 01-12-2022దీకి ఖయిదా అయి వున్నది. సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని ఉదయం 10.30ని పై కోర్టులో హాజరై కోర్టు వారికి మనవి చేసుకొనవలసినది లేనియెడల మీ పరోక్షమున విచారణ తీర్మానం చేయబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం

యలమంచిలి 20-11-2022
డి.నాగేశ్వరరావు, పిటిషనరు తరపు అడ్వకేటు, యలమంచిలి, 9441466767

మహారాజశ్రీ పిఠాపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.68/22 O.S.217/2015

బిట్వీన్ :
తేటకాయల @ గుర్రం వినీత - పిటీషనర్/వాది.
అండ్
ముమ్మిడి సత్యనారాయణమ్మ & అథర్స్
- ప్రతివాదులు

R11. ముమ్మిడి జ్యోతి W/o. గోవిందు 54 years MSN Charities కాటా దగ్గర, యానాం రోడ్, చొల్లంగి, తాళ్లరేవు మండలం
R12 ముమ్మిడి చక్రరావు S/o. గోవిందు, 44 years MSN Charities కాటా దగ్గర, యానాం రోడ్, చొల్లంగి, తాళ్లరేవు మండలం
R13 ముమ్మిడి మణికంఠ S/o. గోవిందు, 42 years MSN Charities కాటా దగ్గర, యానాం రోడ్, చొల్లంగి, తాళ్లరేవు మండలం KKDJCJ

పై నెంబర్ పిటిషన్‌లో వాది మిమ్ముల్ని R11 to R13 ముమ్మిడి గోవిందు వారసులుగా చేర్చమని ఉన్నారు. మీరు నోటీసు అందుకోనందున శ్రీ కోర్టువారు పేపర్ ద్వారా నోటీసు ఆర్డర్ వేసినారు కావున మీ అభ్యంతరములు 25-11-22 తేదీ ఉదయం 10.30 పై కోర్ట్ వారి ఎదుట హాజరై తెలియ చేయవలెను లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్పు చెప్పబడును.

బత్తిన లక్ష్మణ దొర
అడ్వకేట్, పిఠాపురం

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

రాబిస్ వ్యాధితో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రాజవొమ్మంగి :రాజవొమ్మంగి మండలం వాతంగి గ్రామానికి చెందిన భీమిరెడ్డి జనార్ధన్ రాబీస్ వ్యాధితో కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. జడ్డంగి పిహెచ్‌సి వైద్యురాలు సేవాసుజి తెలిపిన వివరాలు ప్రకారం గత నెల 27వ తేదీన జనార్ధన్ తన ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో ముఖంపై కుక్క తీవ్రంగా కరవడంతో జడ్డంగి పిహెచ్‌సి లో మొదటిడోసు రాబిపూర్ ఇంజక్షన్ ఇచ్చి, మెరుగైన వైద్యంకొరకు అడ్డతీగల సిహెచ్‌సికి రిఫర్ చేసినట్టు తెలిపారు. తదనంతరం ఆయనకు2,3 డోసులు పూర్తి చేశామని తెలిపారు. ఈ నెల20న తిన్న ఆహార పదార్థాలు నోటి నుండి ముక్కులోనికి వస్తున్నాయని, జ్వరం, వాంతులు అవుతున్నాయని జడ్డంగి పిహెచ్‌సికి రాగా, చికిత్స అందించి, కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేశామన్నారు. రాబీస్ వ్యాధి లక్షణాలు కనిపించడంతో ప్రత్యేక చికిత్స అందిస్తుండగా, మంగళవారం మృతి చెందినట్టు తెలిపారు. జనార్ధన్ వైసీపీకి చెందిన వాతంగి సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి భర్త.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి

విశాలాంధ్ర-రాజవొమ్మంగి :రాజవొమ్మంగి ఈఓపీఆర్డీ వివి శ్రీనివాస్ సచివాలయంలో స్థానిక వ్యాపారు లతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాంసపు దుకాణదారులు, తోపుడు బళ్ల వ్యాపారులు వ్యర్థాలను ఊరి చివర రోడ్డుకు ఇరువైపులా వేస్తున్నారని, ఇకనుంచి అలా చేయవద్దని తెలిపారు. కిరాణ కొట్లు,హెూటల్స్ వారు ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారని, అందరూ డస్ట్ బిన్ లను తమషాపుల ముందుంచాలని తెలిపారు. సూచనలు పాటించనివారిపై కఠిన చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ రమణి మాట్లాడుతూ గ్రామాన్ని మనమే శుభ్రంగా ఉంచాలని, అలాచేయని వారి దుకాణాలను తొలగిస్తామని హెచ్చరించారు,ఈకార్యక్రమంలో వైస్ ఎపిపి చప్ప చంద్రరాని,పంచాయతీ సెక్రటరీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

విజ్ఞానానికి మూలం గ్రంథాలయాలు

విశాలాంధ్ర-చింతూరు : విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే మూలమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సవలం అమల పేర్కొన్నారు. చింతూరులోని గ్రంథాలయంలో 55 వ వార్షికోత్సవ ముగింపు వేడుకలకు ఆమె విచ్చేశారు. జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్ మాస్టర్ రావ్ మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రతి ఒక్కరికి గ్రంథాలయాలు ఎంతగానో జ్ఞాన సముపార్జనకు దోహదపడతాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ సుబ్బయ్య మాట్లాడుతూ విజ్ఞానవంతులుగా తయారు కావాలనే వారు లైబ్రరీకి ప్రతిరోజు ఏదో ఒక సమయాన్ని కేటాయించాలని కోరారు. సర్పంచ్ కారం కన్నారావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో గ్రంథాలయాలు ప్రతి ఒక్కరికి దేవాలయాలయ్యాయని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన తదితర పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

అగ్ని బాధితురాలికి ఎస్సై వెంకటేష్ వితరణ

విశాలాంధ్ర-కూనవరం: చూచిరేవులగూడెం గ్రామం అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన బాధితురాలు ముప్పెనబోయిన గంగమ్మ అనే మహిళకి కూనవరం ఎస్ఐ బి. వెంకటేష్ 5000 రూపాయలు నగదు, 40 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు కూరగాయలు, దుప్పట్లు వితరణగా అందించి మానవత్వం చాటుకున్నారు. పూరి గుడిసెల్లో ఉండేవారు అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు కూడా సమాచారమిస్తే ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు తమ వంతు సహాయం చేస్తామని అన్నారు.ఎస్సై చేసిన సహాయానికి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

6వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - సీతానగరం : మండల వ్యాప్తంగా 6వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యసాయాధికారి సూర్య రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్య రమేష్ విశాలాంధ్ర విలేకరితో మాట్లాడుతూ సీతానగరం మండలంలో 11 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నేటికి 6వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వాతావరణ మార్పుల వల్ల రైతుల వద్ద నుండి ధాన్యం సేకరణ త్వరితగతిన చేపడుతున్నామని దీనికి తమ వద్ద ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, సొసైటీలు తమ వంతు కృషి అందిస్తున్నారని అన్నారు.

జోరుగా పంట కాలువ పూడికతీత పనులు

విశాలాంధ్ర - రాజోలు : నియోజకవర్గం పరిధిలోని మలికిపురం మండలం గుడిమె ల్లంక గ్రామంలో పూడుకుపోయిన పంట కాలువ పూడికతీత పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ పనులను మలికిపురం జడ్పీటీసీ సభ్యులు బళ్ళ ప్రసన్న కుమారి, రత్నరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందం ృంగా ఆమె మాట్లాడుతూ దాళ్వా పంటకు సంబంధించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంట కాలువల పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

శ్రీ వశిష్ట గౌతమి పిరమిడ్‌లో మహా అఖండ ధ్యానం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో పేరవరం గ్రామంలోని బ్రహ్మ రిషి పితామహ పత్రీజీ దివ్య ఆశీస్సులతో అమ్మ స్వర్ణమాల ఆధ్వర్యంలో శ్రీ వశిష్ట గౌతమి పిరమిడ్ పేరవరం రాజవరంలో అఖండ ధ్యానం పత్రీజీ పుట్టిన రోజు సంబరాలతో మొదలై ఉగాది వేడుకల వరకు జరుగుతాయి.పిరమిడ్ అద్భుత శక్తి సమస్త మానవాళికి, తన అంతరంగానే ఉన్న "అగ్ని"ని తనలోనే స్థితమై వున్న 'దైవాన్ని' గుర్తు తెప్పించే విధంగా ఒకప్పటి మానవుడు మానవ మహాశక్తి కేంద్రాలైన పిరమిట్లను మహెూన్నతంగా నిర్మించాడు. పిరమిడ్లలో క్రిస్టల్స్ అమర్చడం ద్వారా శక్తి విస్తర, శక్తిప్రసారాలు జరిగి, అవి హీలింగ్ ఎనర్జీస్గా మారతాయి. పిరమిడ్ ధ్యానం చేసినప్పుడు మనస్సుకూ, శరీరానికి. శాంతి, ఆధ్యాత్మిక ఉన్నతి లభిస్తుంది. తొందరగా ఆలోచన రహిత స్థితి పొంది, నాడీమండల శుద్ధి జరుగుతుంది. పిరమిడ్ శక్తి వలన శరీరంలో "విద్యుత్ అయస్కాంత జీవరసాయన చర్యలు" జరిగి దేహంలోని ప్రతి కణం శుభ్రపరచబడుతుంది. అన్ని అవయవాల కణజాలం యొక్క సామర్థ్యం పెరిగి, అఖండమైన మానసిక వికాసం కలుగుతుంది. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఆనందంగా జీవించగలం. ఈ మహా అఖండ ధ్యానానికి అందరూ ఆహ్వానితులే ఉచిత భోజనం ఉచిత వసతులు ఉచితంగా ధ్యానం నేర్పబడును ప్రతి ఒక్కరూ 7 రోజులు చొప్పున వశిష్ట గౌతమీ పిరమిడ్‌లో ఉండి ధ్యాన మహా యజ్ఞంలో పాల్గొనవచ్చు, ధ్యానం సకల భోగ కారిని సకల రోగ నివారిణి నిత్య ఆనందకారిణి. సంప్రదించవలసిన మొబైల్ నెంబర్లు 738633229, 7032969497 మరియు 9110370540, 9490999995.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

విశాలాంధ్ర - కలిదిండి : గడప గడపకు సంక్షేమ ఫలాలను అందించి మీ ముందుకు తల ఎత్తుకుని తిరిగేలా ముఖ్యమంత్రి జగనన్న చేశారని ఎమ్మెల్యే దూలం. నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని గుర్వాయిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు నిలబడి స్వచ్ఛమైన పాలనను జగనన్న అందిస్తున్నారని అన్నారు. మూడేళ్ల పాలనలో అమలు చేసిన పథకాలు అందించిన తీరును ఆరా తీసుకుని మరిన్ని ప్రజా అవసరాలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మద్దవానిగూడెం గ్రామంలో మంచినీటి అవసరాలు తీర్చడానికి, మురుగునీరు పారుదలకు రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 2 నెలలలోపు పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తేజోమణి, హౌసింగ్ ఏఈ పల్లం రాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కనకదుర్గా రాణి, నాగలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బనాల. బ్రహ్మజీ, వైస్ చైర్మన్ పాము రవికుమార్, ఎంపీటీసీ గోదావరి. సత్యనారాయణ, సర్పంచి బత్తిన ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ నల్లూరి. మహాలక్ష్మి, వడుపు రామారావు, పోసిన కొండ, సెక్రటరీ చిరంజీవి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10,108 ప్రమిదల్లో శివలింగ అర్చన

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నల్లమాడు గ్రామంలో 10,108 ప్రమిదలో శివలింగ అర్చన మంగళవారం వైభవంగా నిర్వహించారు. సామూహిక హారతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులు వచ్చి పదివేల 10,108 ప్రమిదలు శివలింగ దీపారాధన కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించారు. పండుగ వాతావరణం గా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే ఉంగుటూరు శివాలయంలో కూడా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాలిపేట దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద మహిళలు దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

సత్యనారాయణను పరామర్శించిన ఎమ్మెల్యే రామరాజు

విశాలాంధ్ర - ఉండి : ఇటీవల హెర్నియా ఆపరేషన్ చేయించుకున్న టిడిపి సీనియర్ నాయకుడు ఎన్ ఆర్ పి అగ్రహారం రెండవ వార్డు సభ్యులు ముగ్గళ్ల సత్యనారాయణను ఎన్ ఆర్ పి అగ్రహారం తన నివాసానికి వెళ్లి ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే మంతెన రామరాజు సత్యనారాయణ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు దోసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, గురువుబెల్లి సత్యనారాయణ, చెన్నం శెట్టి హరి నాయుడు, గంధం బుజ్జి, మూర్తి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం సొమ్ము వెంటనే ఇవ్వాలి

విశాలాంధ్ర-ఉంగుటూరు : రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాలంటే అధికారుల చుట్టు, రైతు భరోసా కేంద్రాలు వద్ద ప్రదక్షణ చేయవలసి వస్తుందని ఉంగుటూరు నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. తొలుత ఉంగుటూరు జాతీయ రహదారి నుండి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళుతూ మార్గమధ్యంలో వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు నినాదాలు చేశారు. నియోజవర్గం నాలుగు మండలాల నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు తరలించారు. అనంతరం తహసీల్దార్ ఏవి రమణకు ధర్మరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మరాజు విలేకరులతో మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో వర్షపు జల్లులు పడుతూ రైతులు మరింత ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులకు దగ్గరలో ఉన్న మిల్లులకే ధాన్యం కేటాయించాలని,రైతుల దగ్గర ధాన్యం తీసుకొన్న వెంటనే కొంత నగదు రైతులకు వెంటనే ఇవ్వాలని,మిల్లుల వద్ద ధాన్యం త్వరగా దిగుమతి అయ్యేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మణులు పాల్గొన్నారు.

భోగేశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన

విశాలాంధ్ర - కలిదిండి: కార్తీక మాసం సందర్భంగా భోగేశ్వర లంకలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత భోగేశ్వర స్వామి వారికి వైద్యులు అడవి. ప్రసాద్, డాక్టర్ అశ్విని కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం కలిదిండి శివారు భోగేశ్వర లంకలో స్వయంభుగా కొలువై ఉన్న భోగేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కుంకుమార్చనలు, స్వామి వారికి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తగిన ఏర్పాట్లను చేశారు.

అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ అధికారులు పనిచేయాలని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మండలంలో పొంగుటూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మంగళవారం బాలరాజు హాజరయ్యారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను బాలరాజు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం కోసం అధునాతనమైన టెక్నాలజీతో రాష్ట్రాన్ని ముందుకి తీసుకు వెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంజిమల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, పొంగుటూరు గ్రామపంచాయతీ సర్పంచ్ పసుపులేటి రాంబాబు, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు మట్ట సత్యనారాయణ, మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు ఏలేటి చిన్నతుక్కయ్య, మాజీ సర్పంచ్ తానేటి రాజు, కైక వరపు గోపి, ప్రభుత్వ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య లో ఇంగ్లీష్ క్లబ్

విశాలాంధ్ర - ఏలూరు : స్థానిక శాంతినగర్ లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఆంగ్ల సంభాషణ ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రారంభించిన ఇంగ్లీష్ క్లబ్ -2022ను ప్రధానోపాధ్యాయురాలు శివ కుమారి ప్రారంభించారు. దీనిలో భాగంగా ప్రతి తరగతిలో విద్యార్థులందరూ ఆంగ్లంలో సంభాషించి, తమ మనసులో భావాలను వ్యక్తపరచగలిగే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రతి తరగతిలో వివిధ అంశాలను ఆంగ్లంలో వివరించిన మొదటి ఐదుగురు విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ,నేటి సమాజంలో ఆధునిక పౌరులుగా అభివృద్ధి చెందాలంటే ఆంగ్లంపై పట్టు తప్పనిసరి అని అన్నారు. సభలో ఎకడమిక్ డీన్ జే. సంజీవ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జి నారీనా, ఆంగ్లశాఖ అధిపతి పి.కుమార్ , కుమారి ఝాన్సీ, శివ, నాగ భారతి, ఆర్. నాగమణి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

విశాలాంధ్ర-చాట్రాయి: ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని సమస్యలు పరిష్కరించడాని కే గడప గడపకూ వస్తున్నామని నూజివీడు శాసనసభ్యులు ప్రతాప్ అప్పారావు తెలిపారు. మంగళవారం పర్వతాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన నూజివీడు శాసనసభ్యులు ప్రతాప అప్పారావు కు మండల వైసీపీ అధ్యక్షులు మిద్దె బాలకృష్ణ పర్వతాపురం పంచాయతీ సర్పంచ్ మిద్దే శివాజీ పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. గడపగడపకు వెళ్ళి ప్రతాప్ సామాన్యులను పలకరించారు. చాలా ఓపికగా అన్ని విషయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి సమస్య తెలుసుకోవడానికి మేము గడపగడపకు తిరుగుతున్నామని ఎన్నడూ లేని విధంగా పేదవాళ్ల కష్టాలను తీరుస్తున్నారని మీరంతా ఆయనను గుర్తుంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ కోపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తహసిల్దార్ విశ్వనాథరావు, ఎంపీడీవో మురళీమోహన్, ఏఈ సత్యప్రసాద్, సంజయ్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, మండల నాయకులు చెలికాని శ్రీరామ్, ఎంపిటిసి లు చింతగుంట్ల వేంకటేశ్వరరావు, కృష్ణ, వనమా వాసు చినబాబు, మోరంపూడి నాగేశ్వరరావు, పామర్తినాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు ఎంపెడా మాజీ డైరెక్టర్ పరామర్శ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకొని చికిత్స పొందుతున్న ఏఎన్ఎం పి.దుర్గా ప్రశాంతిని మంగళవారం టిడిపి సీనియర్ నాయకులు, ఎంపెడా మాజీ డైరెక్టర్ గొడవర్తి విద్యాసాగర్ ప్రమర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని డా.రాజశేఖర్ కు తెలిపారు. ఈయన వెంట కొయ్యలగూడెం పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ, కన్నాపురం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, కన్నాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు గంటలయ్య, చాపల చిన్నబాబు, బొబ్బర చిన్నరాజు, సంకు కృష్ణ బాబు తదితరులు ఉన్నారు.

మద్ది ఆంజనేయస్వామి దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : కార్తీక మాస మహోత్సవముల ఆఖరి మంగళవారం సందర్భంగా జంగారెడ్డి గూడెం మండలం, గురవాయిగూడెం గ్రామం లోని శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. జంగారెడ్డిగూడెం డి.ఎస్.పి. సత్యనారాయణ, సి.ఐ. బాలసురేష్ ఎస్.ఐ. దుర్గా మహేశ్వరావు, గురవాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్యవేణి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, ధర్మకర్తలమండలి సభ్యులు స్వామివారి శేషవస్త్రములతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు మాట్లాడుతూ ఉదయం గం.5 నుండి స్వామివారికి విశేష పూజలు, అష్టోత్తర పూజలు నిర్వహించారని తెలిపారు. ఆలయం వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జంగారెడ్డిగూడెం డి.ఎస్.పి. సత్యనారాయణ, సి.ఐ. బాలసురేష్ ఎస్.ఐ. దుర్గా మహేశ్వర రావు శాంతిభద్రతలను పర్యవేక్షించినట్లు తెలిపారు .అన్నదాన విరాళము లుగా రూ.1 లక్ష99 వేల104లు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.3 లక్షల1 వేయి480, ఇతర సేవలద్వారా రూ.2 లక్షల38 వేల571లు మొత్తం రూ.7 లక్షల39 వేల155లు ఆలయమునకు ఆదాయముగా సమకూరినట్లు ధర్మకర్తలమండలి అధ్యక్షురాలు కీసరి సరిత విజయ భాస్కర రెడ్డి, ఆలయఈఓ ఆకుల కొండలరావు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-తణుకు : ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం తణుకు 2వ వార్డు సంత మార్కెట్ దగ్గర శివాలయం గుడి నుండి 49వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో వైసీపి ప్రభుత్వం అర్హత ఒకటే ప్రామాణికంగా సంతృప్తికరంగా సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగా విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-తణుకు : తణుకు పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా సొసైటీ రోడ్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మంగళవారం కీ.శే. వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణ జరిగింది. అనంతరం జరిగిన కాపు కార్తీక వన సమారాధన కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ విడివాడ రామచంద్రరావు, తణుకు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు కొమ్మిరెడ్డి శ్రీనివాస్, తణుకు మండలం పార్టీ అధ్యక్షులు చిక్కాల వేణు, ఇరగవరం మండలం పార్టీ అధ్యక్షులు ఆకేటి కాశి,తణుకు టౌన్ యూత్ ప్రెసిడెంట్ తులసీరామ్, తణుకు నియోజకవర్గంలో లీగల్ సభ్యుడు విజయ్ పంతం నానాజీ, రెల్లురాయుడు, సతీష్ దువ్వ గ్రామం జనసేన ప్రెసిడెంట్ చిన్ని తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

విశాలాంధ్ర- ముసునూరు: ప్రత్యేక అవసరాల విద్యార్థులు ప్రతి నిత్యం వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా వుంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు.ముసునూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్. అన్నమణి,ఉపాధ్యాయులు డిఎంవిలక్ష్మినారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాలో 19 మందికి ఉద్యోగాలు

విశాలాంధ్ర -భీమవరం: ఎ.పి.నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్ మేళాకు విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చినట్లు ఆర్.ఆర్.డి.ఎస్ .ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన అన్నారు. మంగళ వారం కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 19 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందచేశామని ఈ అవకాశాన్ని కల్పించిన ఎ.పి.నైపుణ్యాభివృద్ధిసంస్థ జిల్లా మేనేజర్ ఎ.కృష్ణారెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కనుల విందుగా అయ్యప్ప పడిపూజ

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ఆగిరిపల్లి గ్రామానికి చెందిన వైసిపి సోషల్ మీడియా నూజివీడు నియోజకవర్గ కో కన్వీనర్ వాకా సక్కేశ్వరరావు గురు స్వామి 18 పడి సందర్భంగా అయ్యప్ప పడిపూజ కనుల విందుగా సాగింది. కేరళ తాంత్రిక పూజారి పప్పా నమ్మూర్తి గురు స్వామి ఆధ్వర్యంలో కలిశం పూజ 18 మెట్లు పూజ పప్ప గురుస్వామిచే పూజా కార్యక్రమం జరిగింది. 18 సంవత్సరాలు పూర్తయిన సంద ర్భంగా కొబ్బరి మొక్కను ప్రత్యేకమైన పూజలు చేసి ఆ కొబ్బరి మొక్కను అయ్యప్ప స్వామి సన్నిధానంలో నాటనున్నారు. ఈ కార్యక్రమానికి నూజివీడు శాసనసభ సభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి కు పుష్పములతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భవానీలు శివదీక్ష పరులు భక్తులు, జడ్పిటిసి పిన్ని బోయిన వీరబాబు, శీలం రాము దాసరి రామారావు, మందాడ శివ శంకర్రావు, ఎంపీటీసీ సాదం గోపి స్వామి నక్కన బోయిన పందు స్వామి పామర్తి నరసయ్య స్వామి పాల్గొన్నారు.

కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తిరిగి ఇవ్వాలి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వర పురం మండలం కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వానికి చెందేలా ఈ నెల 28వ తేదీన జనసేనపార్టీ తరుపున పోరాటం చెయ్యడానికి కార్యాచరణ వేగుళ్ళ లీలా కృష్ణ ప్రకటించారు. కపిలేశ్వరపురం మండలం వల్లూరు గ్రామంలో తన స్వగృహంలో మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి వేగుళ్ళ లీలా కృష్ణ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్ఎల్‌సీ తోట త్రిమూర్తులు ఆధీనంలో ఉన్న పల్లిపాలెం భూమి రికార్డెడ్‌గా ప్రభుత్వ భూమి అని సంబంధిత రికార్డులు మీడియా ప్రతినిధులకు లీలా కృష్ణ చూపారు. తాను గతంలో ప్రకటించిన విధంగా కాకినాడ జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో పల్లిపాలెం భూమి ప్రభుత్వ భూమి అని నిరూపించడానికి కట్టుబడి ఉన్నానన్నారు. తన సవాల్‌ను స్వీకరించిన తోట త్రిమూర్తులు రాజకీయ సన్యాసం స్వీకరించడానికి సిద్ధమా అని వేగుళ్ళ లీలా కృష్ణ ప్రశ్నించారు. పల్లిపాలేం ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం విషయంలో జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయుకులతో కలిసి పోరాటం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

వేగేశ్వరపురంలో గడప గడపకు ప్రభుత్వం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం గ్రామంలో 63వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో హెూంమంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పెన్షన్ కోసం కాళ్ళు అరిగేలా తిరిగే వారిమని, సీఎం జగన్ తమ ఇంటికే పెన్షన్ పంపిస్తున్నారని వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

విశాలాంధ్ర - సీతానగరం : దివ్యాంగుల పింఛన్లను అధికారులు తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల వ్యాప్తంగా ఉన్న 1388 దివ్యాంగుల పింఛన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ గోపాల్ మాట్లాడుతూ పై అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ మండలంలో దివ్యాంగుల పింఛన్ల తనిఖీ నిర్వహిస్తున్నారని దీనిలో భాగంగానే మండలం కూడా తనిఖీ చేశారని అన్నారు.

200 లీటర్లు పులిసిన బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర-చాగల్లు: చాగల్లు మండలంలోని చిక్కాల పాలెం గ్రామంలో మంగళవారం ఎస్.ఇ.బి స్టేషన్ కొవ్వూరు అధికారులు విస్తృత దాడులు చేసి గ్రామానికి చెందిన చింతపల్లి కృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతనికి సంబంధించిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ధ్వంసం చేశారు. దేవరపల్లి గ్రామానికి చెందిన తంగేళ్ల అనంతలక్ష్మిని అరెస్టు చేసి ఆమె వద్ద నుండి 25 లీటర్ల నాటు సారాయి స్వాధీనపరచుకున్నారు. నిడదవోలు మండలంలో వివిధ గ్రామాలకు చెందిన నలుగురు పాత ముద్దాయిలను నిడదవోలు మండల్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి వారిని బైండోవర్ వేసినట్టు సిఐ సత్యనారాయణ తెలిపారు. ఈ దాడులలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు పి. సుధీర్, జీ. బసంతి, వై. గౌరీశంకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని శాసనసభ్యులు తలారి వెంకట్రావు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గౌరీపట్నం లో గోపాలపురం ఎమ్మెల్యే గడప గడపకి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం మహిళలతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఉప సర్పంచ్ పందు రమేష్ బాబు, ఎంపీపీ దుర్గారావు,వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, ఎంపీటీసీ వాణి సొసైటీ అధ్యక్షులు కొర్లపాటి సుబ్రహ్మణ్యం, మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఎంపీడీవో కే ఉమామహేశ్వర శర్మ, తహసీల్దార్ ఎం. రామకృష్ణ ,కార్యదర్శి ఉ. సత్యనారాయణ, వలంటీర్లు వివిధ శాఖలు తదితరులు పాల్గొన్నారు.

ఏటిఏ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పాయం రమేష్, కూరం రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎం.ఆర్.సి కార్యాలయంలో ఇర్పా సూర్య చంద్రరావు అధ్యక్షతన మంగళవారం ఏటిఏ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి సరియం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించే విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంత నియామక చట్టం అమలు చేయాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐటీడీఏ ముందు ధర్నా చేపడుతున్నామని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాల్గొనాలని పేర్కొన్నారు. అనంతరం ఏ టి ఏ మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఇర్పా సూర్య చందర్, సహాయ కార్యదర్శిగా కుంజా రాముడు, ఉపాధ్యక్షులు, ప్రచార కార్యదర్శులుగా తదితర కేటగిరీలకు పలువురును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కుక్కునూరు ఏ టి ఏ మండల అధ్యక్షులు చిర్రి దేవరాజు, మండల నాయకులు పూనెం సుందర్, బంధం వీరబాబు, రత్నమణి, రాధామణి, కార్యా, రజిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - కరప : కరప మండలం యండమూరి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున లారీ వ్యక్తి కాళ్లపై నుంచి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. యండమూరి గ్రామానికి చెందిన సాయిబాబా(46) రోడ్డు పక్కనే ధాన్యం రాసి పోసి ఆ ధాన్యానికి కాపలాధారుగా ధాన్యం రాసి పక్కనే పడుకుని ఉండడంతో లారీ డ్రైవర్ అతను కాళ్లపై నుండి లారీ ఎక్కించాడు. సాయిబాబాను కాకినాడ సామాన్య ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నాడని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కరప గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బస్సును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి పూర్తి వివరాలు తెలియవలసి ఉందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

18వ డివిజన్‌లో గడగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంగళవారం 18వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళ ప్రభుత్వపాలనలో అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్‌తో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని ప్రజలు ఎమ్మెల్యే ద్వారంపూడి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి విలేకరులతో మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఒక్క హామీని అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు చవ్వాకుల రాంబాబు, నల్లబిల్లి సుజాత, సంగాని నందం, బీసీ సెల్ అధ్యక్షులు పేర్ల రజని, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరం మండలంలోని ముంగండ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి నూతన ఆలయ అభివృద్ధి నిమిత్తం డాక్టర్ పితాని సత్యనారాయణమూర్తి రూ.50,116 విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులు తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఎంపీపీ అంబటి భూలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సుంకర ఫౌండేషన్ సేవలు భేష్

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిస్వార్థంగా అందిస్తున్న సుంకర వినయ్ ఫౌండేషన్ సేవలు భేష్ అని బీజేపీ సీనియర్ నాయకులు సత్తిబాబు అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మగ్గం శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సుంకర ఫౌండేషన్ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు అభ్యున్నతికై, ఆర్థికంగా ఎదిగేందుకు తమ సంస్థ ఉచితంగా అందిస్తున్న శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సలాది ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు కోసూరి మీనా,రంగవేని, నాగలక్ష్మి, లావణ్య, నందిని, గ్రామానికి చెందిన సుమారు 60 మంది మహిళలు పాల్గొన్నారు.

స్నేహభావం పెంపుదలకు వన సమారాధన

విశాలాంధ్ర - గోకవరం : అటవీ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది స్నేహభావాన్ని పెంపొందించుకోవడానికి కార్తీక వన సమారాధన వేదిక కావాలని రంపచోడవరం సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎస్. భరణి అన్నారు. మంగళవారం సూది కొండ ఫారెస్ట్ రేంజ్ ప్రాంగణంలో కాకినాడ, రంపచోడవరం డివిజన్ల అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ వన సమారాధన కార్యక్రమానికి రంపచోడవరం సబ్‌డిఎఫ్ఓ ఎస్ భరణి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అటవీ శాఖ సిబ్బంది ఉంటారని, ఫారెస్ట్ సిబ్బంది కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడానికి వన సమారాధనలు ఎంతో దోహదపడతాయని సబ్‌డిఎఫ్ఓ భరణి అన్నారు. సూది కొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ ఆధ్వర్యంలో అటవీ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. ఆటలలో గెలుపొందిన వారికి సబ్‌డిఎఫ్ఓ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల, రాజవొమ్మంగి, గోకవరం, మారేడుమిల్లి, రంపచోడవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌తో పాటు 50 మంది అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్లు కోల్పోయిన బాలుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : స్థానిక తాళ్లపూడి మండలం పైడిమెట్టకు చెందిన జొన్నకూటి దర్శిత్ ఈనెల 12వ తేదిన ఉదయం తన తల్లితో పాటు మేడపైకి వెళ్ళగా, తల్లి బట్టలు ఆరబెట్టుకునే పనిలో ఉండగా బాలుడు దర్శిత్ ఆడుకుంటూ మేడపై ఉన్న 33 కెవి వైరు సమీపంలోనికి వెళ్ళగా విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. హుటాహుటిన తల్లిదండ్రులు బాలుడిని హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళగా చికిత్స చేసి తదుపరి కాళ్లకు ఇన్ఫెక్షన్ రావడంతో దర్శిత్ రెండు కాళ్ళు మోకాళ్ళ కింది భాగం వరకు తొలగించారు. ఈ విషయం తెలిసి చలించిపోయిన కెటిసి విద్యాసంస్థల అధినేత ప్రవీణ్ చక్రవర్తి మానవతా దృక్పథంతో బాలుడు దర్శిత్ కాళ్ళకి ప్లాస్టిక్ సర్జరీ నిమిత్తం ప్రస్తుతం పదివేల రూపాయలను కేటీసీ విద్యా సంస్థల అధినేత ప్రవీణ్ చక్రవర్తి బాలుడి తల్లిదండ్రులకు నగదును అందజేశారు. తదుపరి మెడికల్ ఖర్చుల నిమిత్తం ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తను అందజేస్తానని తెలిపారు. మరి కొంతమంది జర్నలిస్టులు బాలుడి వైద్య ఖర్చు నిమిత్తం విరాళాలు అందజేశారు.

తామరాడ పుంత రోడ్డుకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కిర్లంపూడి : కిర్లంపూడి మండలం తామరాడ గ్రామం నుండి వీరవరం మొగ వరకు నిర్మించతలపెట్టిన పుంత రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ తోట రవి చేతుల మీదుగా మంగళవారం శంఖుస్థాపన చేసారు. ఈ పుంత రోడ్డు నిర్మాణం వల్ల పొలాలకు వెళ్లే రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీపీ తోట రవి అన్నారు. ఈ కార్యక్రమంలో తోట గాంధీ, తామరాడ సర్పంచ్ తోట అయ్యన్న, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి లక్ష్మణ్, రైతులు గోకేడ సత్యనారాయణమూర్తి పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం రావులపాడు శివారు మల్లాయిదొడ్డి వద్ద మంగు కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి స్వయంగా భోజనాలు వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో నిర్వహించే వన సమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. తన కుటుంబ సభ్యులు, వైసీపీ శ్రేణులతో పాటు నియోజకవర్గంలోని వివిధ సామాజిక వర్గాల ప్రజలతో చెందిన వారితో కలిసి వన భోజనాలు ఏర్పాటు చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ అన్న సమాధానానకు కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆట పాటలతో సందడి చేశారు.